సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన నేతలకు కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన నేతలు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి నేతృత్వంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు టి లక్ష్మారెడ్డి, కె జయరాం, మాజీ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రషీద్, సీనియర్ నాయకులు కృష్ణ గౌడ్, మిర్జా రషీద్ బేగ్, ముప్వ రవి కిరణ్ తదితరులు కాంగ్రెస్ లో చేరారు. వీరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముఖ్య నేతల కోసం మంతనాలు

కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలతో పాటు నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు చేరగా తాజాగా కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల ప్రాంతాల్లో కీలకంగా ఉన్న పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ పార్టీలో నైరాశ్యం ఏర్పడిందని చెప్పుకోవచ్చు. ఇటీవల జరిగిన పరిణామాలను పరిశీలిస్తే నిజాంపేట్ పరిధిలో మెజార్టీ కార్పొరేటర్లు, మేయర్ కాంగ్రెస్ పార్టీలో చేరగా కొంపల్లి నుంచి పలువురు చేరికకు రంగం సిద్ధం చేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ఆయా పార్టీల నాయకులపై కన్నేసి జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా మరి కొంత మంది ముఖ్య నాయకులను పార్టీలో చేరే విధంగా మంతనాలు జరుపుతున్నారు. ఒకప్పుడు బీఆర్ఎస్ పార్టీకి ఇక్కడ బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ తాజాగా జరుగుతున్న పరిణామాలు ఇందుకు విరుద్ధంగా మారాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మేడ్చల్ టాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి



సుచిత్ర సర్వీసు రోడ్డులో డివైడర్‌ను ఢీకొని నిలిచిపోయిన కారు (ఫైల్)

కుత్బుల్లాపూర్: రోడ్డు భద్రతకు పెద్దపీట వేస్తూ వాహనదారులు నిబంధనలను అతిక్రమించకుండా కట్టడి చేస్తున్నామని మేడ్చల్ టాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆల్వాల్ ట్రాఫిక్ పీఎస్‌లో సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ ట్రాఫిక్ సజావుగా కొనసాగడానికి చేపట్టిన చర్యలపై వివరించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయని, తమ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

నిభంధనలు అతిక్రమిస్తే కఠినంగా చర్యలు

- డ్రంకన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వాహనదారులపై 304 సెక్షన్ కింద కేసులు నమోదు చేసి తీవ్రతను బట్టి జైలుకు సైతం పంపుతున్నారు.
- నెంబర్ ప్లేట్లు లేని వాహనదారులపై 419 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నారు.
- మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులతో పాటు వాహనాలు ఇచ్చిన వారికి 3 నెలల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తున్నారు.
- డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తున్నామని ఏసీపీ పేర్కొన్నారు.

కఠిన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రమాదాలు తగ్గుముఖం..

- 2020 సంవత్సరంలో యాక్సిడెంట్లు (238) జరిగితే 50 మంది మృత్యువాత పడ్డారు.
- 2021లో 269 ప్రమాదాలు చోటు చేసుకోగా 54 మంది మృతి చెందగా, 218 మంది గాయపడ్డారు.
- 2022లో 195 మంది ప్రమాదాలకు గురి కాగా 55 మంది మృత్యువాత, 182 మందికి గాయాలయ్యాయి..
- 2023లో 172 ప్రమాదాలు చోటు చేసుకోగా 44 మంది మృతి చెందగా, 151 మంది గాయపడ్డారు.
- 2024 (మార్చి 31 వరకు) ప్రమాదాలు జరుగగా 12 మంది మృతి చెందగా, 49 మంది గాయపడ్డారు.

స్పెషల్ డ్రైవ్

- అదే విధంగా రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిపుల్ డ్రైవింగ్, మైనర్ల డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి కట్టడి చేసేందుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ వస్తున్నారు.
- 2020లో రాంగ్‌రూట్(21068), సెల్‌ఫోన్ డ్రైవింగ్ (1919), త్రిపుల్ డ్రైవింగ్ (12470), మైనర్ డ్రైవింగ్ (91), డ్రంకన్ డ్రైవ్ (1144) కేసులు నమోదయ్యాయి.
- 2021లో రాంగ్‌రూట్(20875), సెల్‌ఫోన్ డ్రైవింగ్ (2242), త్రిపుల్ డ్రైవింగ్ (17713), మైనర్ డ్రైవింగ్ (181), డ్రంకన్ డ్రైవ్ (5402) కేసులు నమోదయ్యాయి.
- 2022లో రాంగ్‌రూట్(17381), సెల్‌ఫోన్ డ్రైవింగ్ (1995), త్రిపుల్ డ్రైవింగ్ (10460), మైనర్ డ్రైవింగ్ (71), డ్రంకన్ డ్రైవ్ (5906) కేసులు నమోదయ్యాయి.
- 2023లో రాంగ్‌రూట్(9290), సెల్‌ఫోన్ డ్రైవింగ్ (2190), త్రిపుల్ డ్రైవింగ్ (6569), మైనర్ డ్రైవింగ్ (32), డ్రంకన్ డ్రైవ్ (5431) కేసులు నమోదయ్యాయి.
- 2024 (మార్చి 31 వరకు) రాంగ్‌రూట్ (5430), సెల్‌ఫోన్ డ్రైవింగ్ (1005), త్రిపుల్ డ్రైవింగ్ (2665), మైనర్ డ్రైవింగ్ (06), డ్రంకన్ అండ్ డ్రైవ్ (783) కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



మాట్లాడుతున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, ఆల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు

మల్కాజిగిరిలో మూడో రోజు 7 నామినేషన్లు

ఎన్నికల అధికారి గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మూడవ రోజైన శనివారం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ప్రజా వెలుగు పార్టీ నుంచి లోగరి రమేష్, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బోయిన దుర్గాప్రసాద్ యాదవ్ నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పెండ్యాల సాయివరప్రసాద్, పెసరి కాయల పరీక్షిత్ రెడ్డి, కంటే సాయన్న నామినేషన్లు దాఖలు చేశారన్నారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్, డమ్మీ అభ్యర్థి ఈటల జమున తరఫున శనివారం మరో రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పరిధిలోని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందాల సహాయంతో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వీప్ సిబ్బంది సమన్వయంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా కళాజాత బృందాలు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గతంలో అత్యల్ప ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో స్వయం సహాయక సంఘాలు, జీహెచ్ఎంసీ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో ఓటింగ్ శాతం పెంపుపై వివిధ రూపాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించినట్లు స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు తెలిపారు. దండెపెల్లి శ్రీనివాస్ సాంస్కృతిక సారథి కళాజాత బృందాలు ఓటింగ్ శాతం పెంపు కోసం పలు కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలను చైతన్యపరిచినట్లు పేర్కొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



కళాశాల ప్రతినిధులతో శ్రీనివాస మూర్తి

దుండిగల్: ఇంజినీరింగ్ విద్యార్థులు తమకు వచ్చే అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జి.ఏ శ్రీనివాస మూర్తి అన్నారు. దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో నాన్- డిస్ట్రక్టివ్ టెస్టింగ్, వెల్డింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస మూర్తి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు శిక్షణ, పరిశోధనలు ముఖ్యమని, ఏరోస్పేస్, డిఫెన్స్, మాన్యుఫ్యాక్చరింగ్‌తో సహా వివిధ వివిధ పరిశ్రమల సాంకేతిక ప్రాముఖ్యతలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, డిఆర్‌డిఏ శాస్త్రవేత్తలు కృష్ణమోహన్, శివరావు, వెంకట్‌రెడ్డి, మస్తానియా, బ్రిజేష్ పటేల్, హరిప్రసాద్, కిషోర్నాథ్, కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



సుభాష్‌నగర్: బహదూర్‌పల్లిలోని సాయినాథ్ సొసైటీలో జరుగుతున్న వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు రెండవ రోజు కూడా అంగరంగ వైభవంగా జరిగాయి. శనివారం హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు సమస్యలను నివేదిస్తున్న బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో పలు బస్తీలు, కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా రూ.20 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 50 శాతం, దేశంలో 60 శాతం బీసీ లు ఉన్నారని, కేంద్రంలో కనీసం బీసీలకు మంత్రిత్వ శాఖ లేకపోవడం భాధాకరమన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లతో పాటు అన్ని ప్రాంతీయ పార్టీలు పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టేందుకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మేడవరపు రాజేష్ కుమార్, జంగిల్ నిఖిల్, ప్రశాంత్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు అర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందని కొమరవోలు లావణ్య అన్నారు. సాదుర్ల సౌమ్య అనే విద్యార్థిని ఎంఎస్సీ బయోటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. విద్యార్థినికి కళాశాల ఫీజు నిమిత్తం డబ్బు అవసరం ఉందని హర్ట్ టూ హెల్ప్ సంస్థ వ్యవస్థాపకుడు మూడే రవినాయక్ ద్వారా తెలుసుకున్న దాత శనివారం రూ.10వేల చెక్కును సౌమ్యకు అందజేశారు. కార్యక్రమంలో భరత్, భాస్కర్, మహేష్‌లు పాల్గొన్నారు.

సాంకేతికతను ఉపయోగించుకోవాలి



శివశివానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జరిగిన హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న పలువురు ప్రముఖులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో శనివారం హెచ్ ఆర్ కాన్‌క్లేవ్ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీఐజీఎస్ఐటీఐ వైస్ ప్రెసిడెంట్ కరుణ వేల్పుల మాట్లాడుతూ డిజిటల్ యుగం నేపథ్యంలో పరిశ్రమల్లో ఆటోమేషన్, రిమోట్ వర్క్, ఏ1 వంటివి చురుగ్గా కొనసాగుతున్నాయని, హెచ్‌ఆర్ నిపుణులు కొత్త నమూనాలకు అనుగుణంగా సాంకేతికతను ఉపయోగించుకోవలన్నారు.విర్చుసా కన్సల్టింగ్ ప్రైవేట్‌లిమిటెడ్ డైరెక్టర్ చలపతి మేక వెంకట్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటూ నూతన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. సదస్సులో రిక్రూటర్ సోనియా సెహగల్, కోల్గేట్ పామోలీవ్ సంస్థ బిజినెస్ అనాలసిస్ట్ కిరణ్‌కుమార్, కళాశాల డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ శైలేష్ సంపతి, డిప్యూటీ అసోసియేట్ ప్రెసిడెంట్ దీపిక సంపతి, డైరెక్టర్ రమణారావు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



సుభాష్‌నగర్ ఫేజ్-1లో పేరుకు పోయిన వ్యర్థాలు

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ ఫేజ్-1లోని పలు రోడ్లలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రతివారం జరిగే సంత నేపథ్యంలో 6వ వీధిలో దుకాణదారులు కూరగాయల వ్యాపారుల నుండి డబ్బు తీసుకుని విక్రయాలకు అనుమతిస్తున్నారు. దీంతో కూరగాయలు విక్రయించగా మిగిలిన వ్యర్థాలను స్థానికంగా రోడ్ల పక్కన వేస్తున్నారు. దీంతో వారం రోజుల పాటు చెత్తను తొలగించకుండా అలాగే ఉంచడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. అదే విధంగా 7, 8, 9 వీధుల్లో కూడా అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

విద్యుత్ స్తంభం నుంచి చెలరేగిన మంటలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ జనప్రియనగర్ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం ప్రహరీ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా విద్యుత్ స్తంభానికి మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మట్టిని పోసి మంటలు ఆర్పివేశారు. ఎలాంటి ప్రమాదం సంభవించకపోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వివిధ కేబుల్ వైర్లు ఉండటంతో వాటి వల్లనే ప్రమాదం సంభవించి ఉండవచ్చని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా క్రీడలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇనోవిఎస్ స్కూల్ సీఈవో నితిన్

కుత్బుల్లాపూర్: దూలపల్లిలోని ఇనోవిఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం జరిగిన క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్చరీ, టెన్నిస్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించగా విజేతలకు పాఠశాల సీఈవో నితిన్, డైరెక్టర్ కీర్తనలు బహుమతులు అందజేశారు. అర్చరీ, టెన్నిస్ క్రీడల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు సూర్యతేజ, లియోనల్, సాయిచరణ్‌లను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

సందడి చేసిన చిన్నారులు



జీడిమెట్ల: విద్యార్థులను చిన్ననాటి నుండే చదువులో ప్రోత్సహిస్తే వారి భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అపురూపకాలనీ టీవీఆర్ మోడల్ పాఠశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

22న కూకట్‌పల్లిలో రోడ్‌షో

కూకట్‌పల్లి: ఈనెల 22న కూకట్‌పల్లిలో బీజేపీ నిర్వహించే రోడ్‌షోను విజయవంతం చేయాలని బీజేపీ నేతలు కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ రోడ్ షోకు సంబంధించిన ముందస్తు సమావేశం శనివారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో జరిగింది. కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, మాదవరం కాంతారావు హాజరై మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన రూట్ మ్యాప్, జన సమీకరణకు సంబంధించి అంశాలను బీజేపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తూ రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు.

ఆస్పత్రి వద్ద అన్నదానం



సుభాష్‌నగర్: మేము సైతం మీకోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సూరారం మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఫౌండేషన్ చైర్మన్ కట్టేబోయిన శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి బతుకుదెరువు కోసం చాలామంది వస్తుంటారని, కొంతమందికి పని దొరకకపోవడంతో అకలితో రోడ్లపైనే పడుకునే పరిస్థితులు ఉన్నాయన్నారు. అటువంటి వారి ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నామని తెలిపారు.

ఆకట్టుకున్న 'ఆర్ట్ గ్యాలరీ' చిత్ర ప్రదర్శనలు

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో రెండు వేర్వేరు ప్రదర్శనలను శనివారం ప్రారంభించారు. చిత్రకళాకారుడు వి.లక్ష్మణ్ వేసిన చిత్రాలను 'నేచర్ విత్ హ్యూమన్ ఫేస్' పేరిట చిత్రప్రదర్శనను సినీ నిర్మాత సాయివెంకట్ ప్రారంభించారు. కళాకారుడు వేసిన చిత్రాలను సందర్శకులు కొనియాడారు. ప్రదర్శనలో 27 చిత్రాలను అందుబాటులో ఉంచారు. నేటితో ప్రదర్శన ముగియనుందని నిర్వాహకులు ప్రకటించారు. దివ్యాంగ చిత్రకళాకారులు 41 మంది వేసిన 70 చిత్రాలను యాస్ ఇన్‌క్లూసివ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ పేరిట ప్రారంభించారు. ఈ ప్రదర్శన 23 వరకు కొనసాగనుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు తదితరుల పాల్గొన్నారు.

భవనం నుంచి నిత్యం మురుగునీటి ప్రవాహం



మురుగు నీటితో గుంతలమయంగా మారిన రోడ్డు..



రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు..



ఇళ్ల మధ్యలో పారుతున్న మురుగు నీరు..

కుత్బుల్లాపూర్ : నిత్యం ఆ రోడ్డుపై డ్రైనేజీ పొంగి పొర్లుతుంది. చుట్టుపక్కల ఇళ్లు లేనప్పటికీ ఎక్కడి నుంచి డ్రైనేజీ వస్తుంది అని పలువురు ఆరా తీస్తే పక్కనే ఉన్న ఒక కమర్షియల్ బిల్డింగ్ నుంచి డ్రైనేజీ ఇతర అవసరాలకు ఉపయోగించిన నీరంతా రోడ్డుపైకి వదిలేస్తున్నారు.. ఇదే విషయంపై సంబంధిత సిబ్బంది వెళ్లి నిలదీస్తే నీ దిక్కున్న చోట చెప్పుకో అంటూ.. బెదిరింపులకు దిగడం విశేషం.. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ వైష్ణవి మెడోస్, వుడ్స్ కాలనీతో పాటు ఇతర కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై డ్రైనేజీ నీరు పొంగుతుంది. సమీపంలో ఉన్న కట్ట మైసమ్మ ఆలయం వరకు డ్రైనేజీ నీరు వెళ్తుండడం, ఇదే క్రమంలో రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో స్థానికులు సర్కిల్ అధికారులతో పాటు వాటర్ వర్క్స్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై గల్ఫర్ సహాయంతో ఎక్కడైనా లీకేజీలు ఏర్పడ్డాయా అన్న విషయంపై ఆరా తీస్తూ ముందుకు వెళ్తుండగా కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టి అందులో పలువురికి హోటల్ లకు ఇతర అవసరాలకు అద్దెకు ఇచ్చిన సదరు నిర్మాణదారుడు డ్రైనేజీ నిర్మాణం ఇలా బహిరంగంగా వదిలివేయడం గుర్తించారు. ఇదే విషయంపై వారిని ప్రశ్నించగా... నీ ఇష్టం ఉన్న దగ్గర చెప్పుకో అంటూ బెదిరించి వెళ్ళగొట్టడం విశేషం. డ్రైనేజీ నీరు రోడ్లపై వదిలితే వారిని గుర్తించి భారీగా జరిమానాలు విధిస్తున్న కొంతమంది తీరు మారకపోవడం విశేషం. ఏది ఏమైనా ఈ డ్రైనేజీ నీటిని రోడ్డుపై వదిలిన సంబంధిత బిల్డింగ్ యజమానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో..! వేచి చూద్దాం. కాగా ఈ విషయంపై వాటర్ వర్క్స్ మేనేజర్ అనూషను 'సాక్షి' వివరణ కోరగా తాను పరిశీలించి తప్పకుండా చర్యలు తీసుకుంటానని, డ్రైనేజీ నీటిని బహిరంగ ప్రదేశాల్లో వదిలితే వారిని గుర్తించి జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

ఎట్టకేలకు నాలా కల్వర్ట్ విస్తరణ పనులు మొదలు



కుత్బుల్లాపూర్ గ్రామం రోడ్డులో కల్వర్ట్ వద్ద కుచించుకుపోయిన రోడ్డు..



నాలా కల్వర్ట్ వద్ద జరుగుతున్న విస్తరణ పనులు..

రంగారెడ్డినగర్: నాలా కల్వర్ట్ విస్తరణ పనులు మొదలవడంతో వాహనదారుల ఇక్కట్లు తొలగనున్నాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ చౌరస్తా నుండి కుత్బుల్లాపూర్ గ్రామం వరకు మూడేళ్ల క్రితం రూ. 2 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ పనుల చేపట్టి పూర్తి చేశారు. అయితే కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న నాలా సమీపంలో కల్వర్ట్ వెడల్పు చేపట్టడం మరిచారు. దీంతో కల్వర్ట్ ప్రాంతానికి రాగానే రోడ్డు కుచించుకుపోవడంతో వేగంగా వచ్చే వాహనదారులు అది గమనించగా కల్వర్ట్ ప్రహరీలను ఢీకొన్న ఘటనలు అనేకమున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో నాలాకల్వర్ట్ ప్రాంతం మరింత ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో సాక్షిలో కల్వర్ట్ వెడల్పు విషయమై కథనాలు ప్రచురితం కాగా ఎట్టకేలకు అధికారులు వెడల్పు పనులకు రూ.20 లక్షల నిధులతో శ్రీకారం చుట్టారు. త్వరలోనే పనులు పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని ఏఈ సురేందర్ నాయక్ తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యార్చన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వరార్చనలో భాగంగా శనివారం నృత్య మయూరి కళానికేతన్ శిష్య బృందంచే నృత్యార్చన కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు నైవేద్య, తేజస్వి, ఆరాధ్య, మనస్వి, రిషి, ప్రియ, సాహితి, సృష్టి, శ్రీనిధి కయాతి, శ్రీనిధి, మేఘన, లేక్షన, విష్ణుప్రియలు గణపతి కీర్తన, వరవీణ గీతం, రుక్మిణీ ప్రవేశ దరువు తదితర అంశాలను ప్రదర్శించారు. అనంతరం సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందికుమార్ కళాకారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

శిల్పారామంలో..

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మా దాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం సత్యం డ్యాన్స్ అకాడమీ గురువు మేళ్ల చెరువు కామేశ్వరీ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నమ రామాయణం, పూర్వరంగం, రామాయణ శబ్దం, శ్రీరామచంద్ర భావయామి, నగుమోము, దేహి, జగదానందకారక తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి అలరించారు. కళాకారులు అక్షిత, కీర్తన, విభా, ఇషితా, కళ్యాణి, శ్రావణి, సౌమ్య, శ్రీయ, సాయి సహస్ర, అనన్య జస్మితా తదితరులు పాల్గొన్నారు.